క్లుప్తంగా

స్వచ్ఛ చల్లపల్లికి రూ.61వేల విరాళం



చల్లపల్లి: స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమాలకు తమవంతుగా పాగోలుకి చెందిన కంఠంనేని నరహరి, శ్రీలక్ష్మి కుటుంబ సభ్యులు రూ.60వేలు విరాళాన్ని డాక్టర్ డీఆర్కే ప్రసాద్‌కు సోమవారం అందజేశారు. తమ మామ గారైన చలసాని కాంచనరావు జ్ఞాపకార్థం చల్లపల్లి అభివృద్ధికి ఈ మొత్తాన్ని 'మన కోసం మనం' ట్రస్టులు ఇస్తున్నట్లు తెలిపారు. విరాళం అందజేసిన వారిలో నరహరి, శ్రీలక్ష్మి కుమార్తెలు డాక్టర్ హారిక, నమ్రతలు ఉన్నారు. స్వచ్ఛ మహిళా కార్యకర్త దేసు మాధురి కూడా రూ.1000లు విరాళం అందజేశారు.

రూ. 15లకే కిలో ఉల్లిపాయల విక్రయాలు

మచిలీపట్నంటౌన్: మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కర్నూలు రైతుల నుంచి నేరుగా మద్దతు ధరకు కొనుగోలు చేసిన ఉల్లిపాయలను కిలో 15 రూపాయలకే విక్రయిస్తున్నట్లు రైతు బజార్ ఎస్టేట్ అధికారి లంకె బలిచక్రవర్తి సోమవారం తెలిపారు. నగరంలోని రైతు బజార్‌తో పాటు మొబైల్ వ్యాన్ ద్వారా వివిధ ప్రాంతాల్లో ఈ ఉల్లిపాయలను విక్రయిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన రైతు బజార్‌ను పర్యవేక్షించారు. కార్యక్రమంలో రైతు బజార్ సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌ఓల సంఘం ఏకగ్రీవ ఎన్నిక



చల్లపల్లి: మండల వీఆర్‌ఓల సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా మల్లవోలు లీలా ప్రశాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని వీఆర్‌ఓల సంఘ భవనంలో సోమవారం ఎన్నికల అధికారి మత్తి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా ముదునూరు అమలేశ్వరరావు, కోశాధికారిగా నల్లారి ప్రతిమ, కార్యదర్శిగా దిరిశం రవిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సభ్యులకు మండల వీఆర్‌ఓలు శుభాకాంక్షలు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు

గూడూరు: మండలంలోని తరకటూరు శివారు పర్ణశాలకు చెందిన యువతి కనిపించడం లేదంటూ ఆమె తండ్రి కొండపర్ల రాజేష్ గూడూరు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మచిలీపట్నంలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న యువతి కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె స్నేహితులను వాకబు చేసినా ఎవరికీ తెలియదని చెప్పడంతో సోమవారం రాత్రి గూడూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.ఎన్.వి. సత్యనారాయణ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ



బంటుమిల్లి: మండలంలోని నాగేశ్వరరావుపేట పంచాయతీ శివారు జానకీరామపురం గ్రామంలో వినాయక చవితి పందిరి వద్ద సోమవారం విద్యార్థులచే సరస్వతి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దాదాపు 50 మంది విద్యార్థులు ఈ పూజలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు విద్యార్థులు అందరికి నోట్‌బుక్, పెన్నులు బహూకరించారు. అలాగే వినాయక చవితి నవరాత్రుల్లో భాగంగా శ్రీవిజయ గణపతి ఆలయం వద్ద ద్విచక్రవాహన మోటారు వర్కర్స్ అసోసియేషన్ నిలిపిన గణనాథుడిని మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించి బంటుమిల్లి ప్రధాన కాలువలో నిమజ్జనం చేశారు.

పశువుల దాణా పంపిణీ



మోపిదేవి: పశువుల దాణాను సోమవారం రైతులకు పంపిణీ చేశారు. మండల కేంద్రం మోపిదేవి పశువైద్యశాలలో ఎంపీపీ రావి దుర్గావాణి రైతాంగానికి పశువుల దాణా అందజేశారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ రెండో విడతగా పశువుల దాణా ఎనిమిది టన్నులు వచ్చినట్లు తెలిపారు. ఈ దాణాను సబ్సిడీపై రైతులకు అందజేసినట్లు వివరించారు. గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రావి రత్నగిరి, మండల టీడీపీ అధ్యక్షుడు నడకుదుటి జనార్దనరావు, పాలకేంద్రం అధ్యక్షుడు బొందలపాటి ప్రసాద్, బల్లా సీతారామ ప్రసాద్, యక్కటి అర్జునరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.



ఇండోర్ స్టేడియం సమీపంలో పేరుకుపోయిన చెత్తచెదారం



ఈబీసీ కాలనీ సమీపంలో బైపాస్ రోడ్డు వెంట చెత్త నిల్వలు

పారిశుద్ధ్యం.. అధ్వానం

- వెదజల్లుతున్న దుర్గంధం
- అంటువ్యాధులు ప్రబలుతాయని ప్రజలు ఆందోళన
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు

కోడూరు: కోడూరు పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది. పంచాయతీ అధికారులు చెత్త సేకరణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రహదారుల వెంట చెత్త కుప్పలు పేరుకుపోయాయి. కోడూరు వంతెన సెంటర్ నుంచి బైపాస్ రహదారి పొడవునా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. నాయుడుపేట వంతెన దగ్గర నుంచి ఇండోర్ స్టేడియం పక్క రహదారిలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. నరసింహాపురం వెళ్లే రహదారిలో సాయిబాబా దేవాలయం దాటిన తర్వాత చెత్తకుప్పల నుంచి తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతోంది. దింటిమెరకకు వెళ్లే రహదారిలో కూడా చెత్త నిల్వలు పేరుకుపోయి పరిసరాలు అధ్వానంగా మారాయి. నివాస గృహాల మధ్య చెత్త కుప్పలు ఉండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. చెత్త నిల్వలతో తీవ్రమైన దుర్వాసన కారణంగా ఈ రహదారుల వెంట వెళ్లే వాహనచోదకులు, ప్రయాణికులు ముక్కు మూసుకొని ప్రయాణించాల్సిన దారుణ పరిస్థితి నెలకొంది. ప్రతి రోజూ చెత్త సేకరణ పేరుతో ప్రభుత్వం అనేక వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామంటూ గొప్పలు చెబుతోంది. కానీ కోడూరులో అధికారులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించడం లేదు. ఇక్కడ పారిశుద్ధ్యం లోపించడంపై స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఈ చెత్త నిల్వల వల్ల దోమల బెడద ఎక్కువగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వారు భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెత్త నిల్వలు లేకుండా చేసి పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని కోడూరు పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.



నరసింహాపురం రహదారిలో చెత్త కుప్ప



పశువుల ఆసుపత్రి సమీపంలో రహదారి పక్కన దుస్థితి

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు

పులిగడ్డ(అవనిగడ్డ): క్రమశిక్షణ కలిగి ఉంటేనే విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని పులిగడ్డ గురుకుల పాఠశాలలో సోమవారం ప్రిన్సిపాల్ ఎస్‌టీపీ కుమార్ ఉద్యోగ విరమణ వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో చదువుకున్న వారెందరో ఉన్నత స్థాయికి ఎదిగారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కుమార్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఆయనను ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎంఈవోలు ఎస్.శివశంకర్, అన్నపరెడ్డి పిచ్చయ్య, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్ కుమార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

గేదెకు కొమ్ము విచ్ఛేదన శస్త్రచికిత్స



గోగినేనిపాలెంలో గేదెకు కొమ్ము విచ్ఛేదన శస్త్ర చికిత్స చేస్తున్న డాక్టర్ హరీష్



గేదెకు కొమ్ము తొలగించి కుట్లు వేసిన దృశ్యం

గోగినేనిపాలెం(ఘంటసాల): రెండు గేదెల తగువులాటలో ఓ గేదెకు కొమ్ము విరిగిపోయింది. తీవ్ర రక్తస్రావం కావడంతో అత్యవసర శస్త్ర చికిత్స చేసి కొమ్ము తొలగించిన సంఘటన గోగినేనిపాలెంలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌చార్జి మండల పశువైద్యశాల అధికారి, శ్రీకాకుళం పశు వైద్యశాల డాక్టర్ దేవిన హరీష్ మాట్లాడుతూ.. ఘంటసాల మండలం గోగినేనిపాలెంకు చెందిన వక్కలగడ్డ వెంకటేశ్వరరావుకు చెందిన రెండు గేదెలు కొట్లాడు(పొడుచు)కోవడంతో ఒక గేదె కొమ్ము విరిగి తీవ్ర రక్తస్రావం అయినట్లు తెలిపారు. దీంతో రైతు వెంకటేశ్వరరావు గోగినేనిపాలెంలోని గ్రామీణ పశువుల యూనిట్‌కు తీసుకురాగా స్పందించిన డాక్టర్ హరీష్ గేదెను పరీక్షించి రక్తస్రావం కావడంతో గేదె తలకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని గుర్తించారు. వెంటనే గేదెకు అత్యవసర కొమ్ము విచ్ఛేదన శస్త్ర చికిత్స చేయాలని రైతుకు చెప్పడంతో ఆయన అంగీకరించారు. దీంతో డాక్టర్ హరీష్ గేదెకు శస్త్ర చికిత్స చేసి గేదె కొమ్మును తొలగించి కుట్లు వేశారు. శస్త్రచికిత్స విజయవంతం కావడంతో పాటు గేదె ఆరోగ్యంగా ఉండటంతో రైతు డాక్టర్ హరీష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

పోషకాహార వారోత్సవాలు ప్రారంభం



అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సీడీపీఓ సముద్రవేణి

బంటుమిల్లి: స్థానిక కోర్టు ఏరియాలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషకాహార వారోత్సవాలను ఐసీడీఎస్ బంటుమిల్లి ప్రాజెక్టు సీడీపీఓ ఎం.సముద్రవేణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం తయారు చేయడంలో తల్లి ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న బాలామృతం, పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, గుడ్లు తీసుకుంటే ఆరోగ్యవంతమైన పిల్లలు పుడతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్.నాగలక్ష్మి, మహిళా పోలీసు సిలోన్‌కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నేడు మహానేత వైఎస్సార్ వర్ధంతి

చల్లపల్లి: దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఒకటవ వార్డులోని చల్లపల్లి–మచిలీపట్నం ప్రధాన రహదారి పక్కనున్న వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శీరం వెంకట సత్యనారాయణ(నాని) సోమవారం తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పెడన: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని మంగళవారం వైఎస్సార్ సీపీ పెడన కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

మచిలీపట్నంలో బైక్ ర్యాలీ

కోనేరుసెంటర్: దివంగత మహానేత వైఎస్సార్ వర్ధంతిని మచిలీపట్నంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మేకల సుధాకర్(సుబ్బన్న) తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని), నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టుల ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులు అర్పించడం జరుగుతుందని తెలిపారు. మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమయ్యే బైక్ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రేపటి నుంచి శ్రీకాకుళేశ్వరస్వామి పవిత్రోత్సవాలు





శ్రీకాకుళంలోని శ్రీకాకుళేశ్వర స్వామివారి దేవస్థానం (ఇన్‌సెట్‌లో) శ్రీకాకుళేశ్వర స్వామివారు

శ్రీకాకుళం(ఘంటసాల): ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలో వేంచేసియున్న శ్రీకాకుళేశ్వర స్వామివారి దేవస్థానంలో నవమ వార్షిక పవిత్రోత్సవాలు బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల మూడు నుంచి ఆరవ తేదీ వరకు అగ్నిహోత్రం భాస్కరాచార్యులు పర్యవేక్షణలో శ్రీమాన్ ముత్తేవి వెంకట సత్యనారాయణాచార్యులు సారథ్యంలో పవిత్రోత్సవాలు జరుగుతాయని చెప్పారు. 3న బుధవారం రాత్రి 7.30 గంటలకు పార్థన సూక్తం, విష్వక్సేనపూజ, పుణ్యాహవాచన, వాస్తు హోమం, ఇతర పూజా కార్యక్రమాలు, 4న ఉదయం 7.29 గంటలకు విశ్వ శాంతి కోసం నవగ్రహ యజ్ఞం పంచవింశతి కుంభాసాధన, అభిమంత్రణ, ప్రధాన హోమం, రాత్రి 7.02 గంటలకు అగ్న్యారాధనలు, పవిత్రములకు అధివాసం, కుంభాభి మంత్రణ, హేత్రప్రశంసన, విశేష హోమాలు, అష్టోత్తర శతకలశసాధన, 5న విష్వక్సేన పూజ, పుణ్యాహం, అష్టోత్తర శత కలశ ఆరాధ అనంతరం శ్రీస్వామివార్లకు అష్టోత్తర శత కలశ స్నపన, అలంకరణ విశేష హోమాలు, రాత్రి 7.02 గంటలకు కుంభాభిమంత్రణ శాంతిక పౌష్టిక హోమాలు, 6న పవిత్రవిసర్జన, మహాపూర్ణాహుతి అనంతరం శ్రీస్వామివార్లకు శాంతి కల్యాణం జరుగుతాయని వివరించారు. రోజువారి కార్యక్రమాల అనంతరం నీరాజన, మంత్రపుష్ప తీర్థప్రసాద వినియోగం జరుగుతాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. కావునా భక్తులు పెద్ద ఎత్తున పవిత్రోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కొడాలి గ్రామాన్ని మండల కేంద్రం చేయాలి

ఘంటసాల: ప్రజా ప్రయోజనాల నిమిత్తం ఘంటసాల మండలంలోని కొడాలి గ్రామాన్ని మండల కేంద్రంగా మార్చాలని కోరుతూ బీఎస్పీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు గుంటూరు నాగేశ్వరరావు కలెక్టర్ డీకే బాలాజీకి సోమవారం మీ కోసం కార్యక్రమంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నేతలు దేవరపల్లి డేవిడ్ రాజు, బీసీ నేత రాజులపాటి వీర వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.



మచిలీపట్నంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాగేశ్వరరావు

వినాయక.. సెలవిక

కృత్తివెన్ను: వినాయక చవితి మహోత్సవాల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం గణనాథుని నిమజ్జనాలు జరిగాయి. కృత్తివెన్ను, నీలిపూడి, చందాల తదితర గ్రామాల్లో గణపతిని మేళతాళాల నడుమ భక్తులు ఆనంద పరవశంలో ఊరేగించి నిమజ్జనం చేశారు. నీలిపూడిలో శక్తి, వివిధ దేవతామూర్తులతో పాటు విచిత్రమైన వేషధారణలు ఆకట్టుకున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపతికి వీడ్కోలు పలికారు.

ఘనంగా గ్రామోత్సవం

ఘంటసాల: ఘంటసాల పెద్దగూడెంలో చిన్నారులు ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జనంలో భాగంగా సోమవారం రిక్షాపై గ్రామోత్సవం నిర్వహించారు. చిన్నారులు స్వచ్ఛందంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి గ్రామస్తుల సహకారం అందించడంతో వైభవంగా నిర్వహించారు. కొడాలి వార్షిష్ వర్మ, కనగాల పవన్ కుమార్, దిరిశం సుమంత్, దిరిశం చింటూ, దిరిశం శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

మోపిదేవి: స్థానిక గౌడపాలెం రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణేశుని విగ్రహాన్ని సోమవారం సమీపంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. గణనాథుని విగ్రహాన్ని ఊరేగింపుగా తరలించారు. స్థానిక ఎస్‌ఐ సత్యనారాయణ బందోబస్తు నిర్వహించారు.

గూడూరు: గూడూరు మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మండల కేంద్రమైన గూడూరులోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ సెంటరులో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భారీ అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పరిసర ప్రాంతాలకు చెందిన దాదాపు నాలుగు వేల మంది భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారని నిర్వాహకులు తెలిపారు.

ఆరో రోజు ఉత్సవాలు

పెడన: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో ఆరో రోజుకు చేరాయి. వినాయక చవితి పందిళ్ల వద్ద ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ తీర్థప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



పెద్దగూడెంలో రిక్షాపై వినాయకుని నిమజ్జన గ్రామోత్సవం



కృత్తివెన్ను మండలం నీలిపూడిలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు



నీలిపూడిలో శక్తివేషధారణలో కళాకారుని విన్యాసం



పెడనలో వినాయకునికి పూజలు చేస్తున్న భక్తులు



గూడూరులో పూజలందుకుంటున్న బొజ్జ గణపయ్య



గౌడపాలెంలో ఊరేగింపుగా తరలివెలుతున్న గణనాథుడు

వైఎస్సార్ సీపీ నాయకుడికి నివాళి



వెంకటేశ్వరరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు

బండికోళ్లంక(మోపిదేవి): మండలంలోని కొక్కిలిగడ్డ శివారు బండికోళ్లంక గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మీసాల చిట్టిబాబు తండ్రి వెంకటేశ్వరరావు(80) సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, కడవకొల్లు నరసింహారావులు వారి ఇంటికి వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట పార్టీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, గ్రామ కన్వీనర్ రాయన సత్యనారాయణ, ఎస్సీ సెల్ కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, లింగం జగదీష్ కుమార్, మత్తి వెంకట రాజాచంద్, తుటారం కృష్ణ, గ్రామ సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు దిడ్ల రాణి ఉన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం



ఘంటసాల: ఘంటసాల గ్రామంలోని శ్రీ జలధీశ్వరస్వామి ఆలయం ముందు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద నవరాత్రి వేడుకలు కొనసాగుతున్నాయి. ఈ వేడుకల్లో సోమవారం రాత్రి చల్లపల్లికి చెందిన మెహెర్ నృత్య నికేతన్ గురువు దాలిపర్తి మెహెర్ దుర్గా నరసింహారావు ఆధ్వర్యంలో 22 మంది విద్యార్థినులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం నృత్య ప్రదర్శన చేసిన విద్యార్థినులకు రిటైర్డ్ హెచ్‌ఎంలు పోతన వెంకటేశ్వరరావు, అనురాధ దంపతులు ప్రత్యేక బహుమతులు అందించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భానుప్రకాష్, పీఏసీఎస్ చైర్మన్ బండి పరాత్పరరావు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, అక్బర్ బాషా (షామియాన), కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల పంపిణీ

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కనపర్తి శ్రీనివాసరావు, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.